## మీ హృదయమే రామమందిరము

చక్కెర కంటె తీపి దధిసారము కంటెను రుచ్యమౌను పెం
పెక్కిన తేనె కన్న అతి తృప్తినిడున్ నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్

త్రేతాయుగము గడచిపోయి అనేక వేల సంవత్సరములైనది. ఇన్ని సంవత్సరములు గడచినప్పటికీ నేటికీ బాలలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ రానామమును స్మరిస్తూ వున్నారంటే ఇది ఎంత గొప్ప మహిమ కలిగినదో అందరూ గుర్తించాలి. 'రామ' అనేది దేహమునకు పెట్టిన పేరు మాత్రమేగాని దేహము రాముడు కాదు. ఆత్మయే రాముడు. అతని పేరు ఆత్మారాముడు. కాబట్టి, అతని పేరు స్మరించేవారికి ఎప్పటికైననూ, ఏనాటికైననూ ఇంట, వెంట, జంట, కంట వుంటాడు.

ప్రేమస్వరూపులారా! 'రామా' అన్నా, హృదయమన్నా, ఆత్మ అన్నా అంతా ఒక్కటే. ప్రతి సంవత్సరము కూడను శ్రీరామనవమి పండుగ వస్తూనే వున్నది. కాని, మనము ఎనితవరకు దీని విశిష్టతను తెలుసుకొన్నామో గుర్తించాలి. మీరు 'రామా' అంటే కేవలం ఒక రూపాన్ని భావిస్తున్నారు. కాని, రాముడనగా ఒక రూపము కాదు. హృదయమునకే 'రామ' అని పేరు. ఇట్టి నామమును ఎవ్వరూకూడను ఏనాటికినీ మార్చలేరు. జగత్తులో ఎన్నియో మారుచున్నవి. అన్నీ కదలిపోవుచున్నవి. కాని, రామనామము నిత్యమై, సత్యమై, నిర్మలమై నిలచియున్నది. రాముడు సామాన్య మానవుడు కాదు. జగత్కళ్యాణము నిమిత్తమై అవతరించిన పరమాత్మయే! కొందరు 'రామా' యని, కొందరు 'కృష్ణా' అని, కొందరు 'ఈశఅవరా' అని, కొందరు 'మహాదేవా' అని ఈవిధంగా భగవంతునికి అనేక పేర్లు పెడుతున్నారు. ఈ అన్ని నామములు కూడను ఒకే భగవంతునికి సంబంధించినవే! ఈ దివ్య నామములయొక్క మహిమను మనము చక్కగా గుర్తించాలి. వసిష్ఠుడు చెప్పాడు, 'రామో విగ్రహవాన్ ధర్మః'. ధర్మస్వరుశిపుడే రాముని స్వరూపము ధరించినది. ధర్మమును మనం అనుసరించాలి. ఏమిటా ధర్మము? హృదయమునకు సంబంధించిన తత్త్వమే ధర్మము. మనస్సుకు తోచినట్లుగా పోకూడదు.

*దేహభ్రాంతి లేనటువంటిది 'వైదేహి'*

ధర్మస్వరూపుడైన రామునికి సీత తోడు వచ్చింది. ఎక్కడ పుట్టింది? ఆమె భూగర్భములో పుట్టింది. జనకుడు ఒక యజ్ఞము నిమిత్తం భూమిని దున్నుతూ వుండగా ఆ గర్భమునుండి ఒక పెట్టె లభించింది. అది తెరచి చూస్తే అందులో ఒక చంటిబిడ్డ వుంది. 'ఇది నాకు భగవంతుని వరప్రసాదము' అని భావించి జనకుడు ఆ చంటిబిడ్డను తన ఇంటికి తీసుకొనివచ్చి 'సీత' అని పెరుపెట్టి అల్లారుముద్దుగా సాకుతూ వచ్చాడు. సీత విదేహరాజు పుత్రిక కాబట్టి, ఆమెకు 'వైదేహి' అనగా దేహభ్రాంతి లేనటువంటిది. ఇది చాలా ప్రధానమైన పేరు.

*శివధనుర్భంగము*

జనకుని గృహంలో ఒక పెట్టె వున్నది. అందులో ఒక పెద్ద శివధనుస్సు వున్నది. ఒకరోజున వైదేహి, మరి కొందరు పిల్లలు కలసి బంతితో ఆడుకుంటూ వుండగా బంతి ఆ పెట్టె క్రిందకి పోయింది. ఆ పెట్టెను ప్రక్కకి జరపటానికి ఎవ్వరికీ సాధ్యం కాలేదు. సీత వెళ్ళి తన ఎడమ చేతితో దానిని ప్రక్కకి జరిపి ఆ బంతిని బయటకు తీసింది. ఆ దృశ్యాన్ని చూచిన జనకుడు ఆనాడే సంకల్పించుకొన్నాడు, సీతయొక్క శక్తిసామర్థ్యములు ప్రపంచానికి చాటాలని. తరువాత తాను ఒక యజ్ఞమును తలపెట్టి, శివధనుస్సును ఎవరైతే ఎక్కుపెట్టగలరో వారికి సీతనిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు. 'జనకమహారాజు కుమార్తె చాలా గొప్పది. జనకమహాజంతటివానికి అల్లుడు కావటం గొప్ప అదృష్టం' అని భావించి అన్ని దేశములయొక్క రాజులుకూడను అక్కడికి వచ్చారు. ఒకరి తరువాత ఒకరు వరుసగా వచ్చి శివధనుస్సును ఎత్తటానికి ప్రయత్నం చేశారు. కాని, ఎవ్వరికీ సాధ్యం కాలేదు. విశ్వామిత్రుని వెంట వచ్చిన రామలక్ష్మణులు కూడా ఆ సభలో వున్నారు. విశ్వామిత్రుని సూచన మేరకు రాముడు ముందుకు వెళ్ళాడు. అతని మాటలు,ఆటలు, పాటలు అన్నీ మృదుమధురమైనవి. ప్రజలు మెచ్చేటట్లుగా తాను వినయముతో నడచుకుంటూ ఆ పెట్టె దగ్గరకు వెళ్ళి శివధనుస్సును ఎడమ చేతితో ఎత్తాడు. అది అసాధ్యమని భావించరందరూ. కాని, రామునికి సాధ్యముకానిదేమున్నది! తన సంకల్ప మాత్రము చేత దేనినైనా సాధించగలడు. ఆ ధనుస్సును ఎడమ చేతితోనే వంచాడు. తక్షణమే అది పెద్ద శబ్దం చేస్తూ విరిగిపోయింది. అందరూ కరతాళ ధ్వనులు చేశారు. అప్పుడు విశ్వామిత్రుడు

రాముని దగ్గరకు వెళ్ళి, 'రామా! ఈనాడు నీ దివ్యత్వమునకు తగిన శక్తిని నీవు ప్రదర్శించావు. ఇది దైవశక్తియేగాని మానవశక్తి కాదు' అని కీర్తించాడు. అందరూ వచ్చి రాముని గొప్పగా వర్ణించి, అతనికి పూలమాలలు వేయసాగారు. అప్పుడు జనకుడు సీతను తీసుకువచ్చాడు. కాని, రాముడు అటువైపు చూడనైనా చూడలేదు. ఎందుకంటే, తల్లిదండ్రుల ఆజ్ఞ లేకుండా ఆమెను చూడకూడదని అతని వుద్దేశ్యము.

సీతారామ కళ్యాణం

జనకమహారాజు అయోధ్యకు ఈ శుభవర్తమానం పంపించాడు. పెండ్లి ముహూర్తం నిర్ణయించి అందరూ రావలసిందిగా కోరాడు. 'మీ కుమారుడు నేను పెట్టిన పోటీలో విజయం సాధించాడు. కాబట్టి, మీరందరూ కూడను సీతారాముల వివాహ మహోత్సవానికి సిద్ధమై రావాలి' అని కోరాడు. సీతారాముల కళ్యాణమునకు స్త్రీలందరూ ఆనందముగా పాటలు పాడుకుంటూ బయలుదేరారు.

రారే చూడగ పోదాము రాముని పెండ్లి
రారే చూడగ పోదాము రమణులందరు కూడి
వింతల బంగళాలు, ముత్యపు తోరణాలు
మూలల కిటికీలు, వజ్రాల తలుపూలు
తాపిన నీలాలు, నీలాలు వెయ్యార్లు
నూరార్లు బజార్లు.............. ॥రారే॥

ఈవిధంగా ఒకవైపు స్త్రీలు తరలి వస్తుంటే, మరొవైపున పురుషులు పాడుకుంటూ వస్తున్నారు.

కౌసల్యా తనయుని కళ్యాణము చూతము రారండి!
అయోధ్యావాసుని కళ్యాణము చూతము రారండి
చూచువారలకు చాల పుణ్యమట
పుణ్యపురుషులకు ధన్యభాగ్యమట.. ॥క॥

అయోధ్య అంతా కదలి వచ్చిందా అనిపించేటట్లు దశరథుడు, అతని రాణులు, భరత శతృఘ్నులు, మంత్రులు అందరూ ఆనందోత్సాహములతో తరలి వచ్చారు. జనకుడు సకల రాజలాంఛనాలతో వారికి స్వాగతం పలికి గౌరవ మర్యాదలు చేశాడు.

జనకునికి రెండవ కుమార్తె పేరు ఊర్మిళ. ఆయన తమ్మునికి మాండవి, శ్రుతకీర్తి అని ఇరువురు బిడ్డలు. ఊర్మిలను లక్ష్మణునికి, మాండవిని శతృఘ్నునికి యిచ్చి వివాహం జరిపించాలని నిర్ణయించారు. 'నలుగురం ఒక తూరి పుట్టాము. కాబట్టి, నలుగురి వివాహాలు ఒకేతూరి జరగాలి' అని రాముడు కోరాడు. అందరూ వారివారి స్థానములలో ఆశీనులయ్యారు. కళ్యాణ మహోత్సవము ప్రారంభమైంది. రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు వారి ఎదుట వరుసగా సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి నిలుచున్నారు. మొట్టమొదట సీత రాముని మెడలో మాల వెయ్యాలి. రాముడు ఆజానుబాహుడు. సీత కొంచెం పొట్టిది. రాముడు ఆమె ముందు తల వంచటం లేదు. ఎంత ప్రయత్నించినా సీతకు రాముని మెడలో మాల వేయటం సాధ్యం కావటం లేదు. అప్పుడు లక్ష్మణుడు ఒక యుక్తి పన్నాడు. తాను రాముని పాదాలకు సాష్టాంగ నమస్కారము చేశాడు. అతనిని లేవనెత్తటానికి రాముడు ముందుకు వంగేసరికి తక్షణమే సీత రాముని మెడలో మాల వేసింది. ఆ తరువాత మిగిలిన పెళ్ళి కుమార్తెలు పెళ్ళి కుమారుల కంఠసీమలను పూలమాలలతో అలంకరించారు. ప్రజలందరూ ఆనందముతో జయజయధ్వానాలు చేశారు.

మంచి చెడ్డలు రెండును కలసియుండు

రామునియొక్క చర్యలు, లీలలు, వాభావలను వర్ణించుటకు వీలుకాదు. కళ్యాణ మహోత్సవము తరువాత అందరూ అయోధ్యకు బయలుదేరారు. మార్గమధ్యములో ఒక పెద్ద శబ్దము వచ్చింది. ఎక్కడినుండి వచ్చిందీ శబ్దము అని చూడగా పరశురాముడు మహోగ్రరూపం దాల్చి వస్తున్నాడు. 'ఇంత వైభవముగా వివాహ మహోత్సవము జరిగిన తరువాత మధ్యలో ఈ అవాంతరమేమిటి?' వారు కలవరపడ్డారు. మంచి, చెడు రెండూ ఒకదానికొకటి తోడుగా వుంటాయి. మిథిలలో వారు ఎంత ఆనందమును అనుభవించారో అయోధ్యకు వెళ్ళే మార్గములో అంత కష్టాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. దశరథుడు తదితరులు చాలా భయపడిపోయారు. పరశురాముడు దగ్గరకు వచ్చి, 'శివుని ధనుస్సు విరిచిందెవరు?' అని ప్రశ్నించాడు. 'నేనే' అన్నాడు శ్రీరాముడు. 'అట్లైతే నా ధనుస్సును విరుచు, చూద్దాం' అంటూ తన ధనుస్సును అతని చేతికిచ్చాడు. రాముడు దానినికూడా ఎడమచేతితో విరిచాడు. అప్పుడు

పరశురాముడు రామునికి నమస్కరించి అక్కడనుండి వెళ్ళిపోయాడు. ఆ విజయోత్సాహంతో అందరూ అయోధ్యకు చేరారు.

మంథరలాంటివారు ఎక్కడ చూచినా వుంటారు

రామునియొక్క శక్తి, సీతయొక్క భక్తి, ఈ రెండింటినీ జగత్తునకు వ్యాప్తి గావించే నిమిత్తమై అయోధ్యలో ప్రజలు ఆనందంగా అనేక ఉత్సవాలు జరుపుకున్నారు. ఇదంతా చూచి మంథరకు అసూయ కలిగింది. ఈ లోకంలో మంథరలాంటివారు ఎక్కడ చూచినా వుంటారు. కైక కుమారునికిస్తానన్న రాజ్యాన్ని దశరథుడు రామునికిస్తున్నాడే అనే కోపంచేత ఆమె రామునికి విరుద్ధంగా అనేక కట్టుకథలు కల్పించి కైకకు బాగా నూరిపోసింది. ఆమె చేసిన దుర్బోధలచేత కైకలో చాలా మార్పు వచ్చింది. మంథర కైకను ఒక కోరిక కోరింది. 'అమ్మా! నేను నీ దాసిని. అయితే, నీవు పుట్టినప్పటినుండి నేనే నిన్ను పెంచి పోషించాను. నా చేతులమీదుగా పెరిగినటువంటి బిడ్డవు నీవు. నా ఒక్క చిన్న కోర్కెను నెరవేర్చు. రామునికి పట్టాభిషేకం చేయాలని దశరథ మహారాజు సంకల్పించాడు. కాని, ఆయన మొదలు నీకిచ్చిన మాట ప్రకారం భరతునికి పట్టం కట్టాలి, రాముని పధ్నాల్గు సంవత్సరాలు అరణ్యానికి పంపించాలి' అని కోరింది. మహారాణి అయిన కైక ఒక సర్వెంట్ మాటలకు లొంగిపోయి రాముని వనవాసానికి కారకురాలైంది. తరువాత 'ఇది మంథర చేసిన కుట్ర' అని గుర్తించి ఆమె పశ్చాత్తాపపడింది. అసలు కైకకు రాములంటే చాలా ప్రేమ. రామునికి సర్వ విద్యలను కైకయే నేర్పింది. రాములుకూడా కైకను తన తల్లి కౌసల్యకంటే ఎక్కువగా ప్రేమిస్తూ వచ్చాడు.

శ్రీరాముని పితృవాక్య పరిపాలన

పట్టాభిషేకం నిమిత్తం సీతారాములు ఇరువురూ పసుపు పచ్చని పట్టువస్త్రాలు ధరించి సిద్ధంగా వున్నారు. వారిద్దరికీ స్వాగతం పలకటానికి సభలో అందరూ కాచుకొని వున్నారు. ఈలోపల రాముడు నెమ్మదిగా కౌసల్య దగ్గరకు వెళ్ళి, ' అమ్మా! నేను అరణ్యానికి బయలుదేరుతున్నాను. నాకు సెలవివ్వు' అన్నాడు. కౌసల్య నిర్ఘాంతపోయి, 'ఎందుకు నాయనా? నీవు పట్టాభిషిక్తుడవు కావలసిన సమయంలో అరణ్యానికి వెళ్ళటమేమిటి?' అన్నది. 'అమ్మా! నేను పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం చేయాలని తండ్రిగారి ఆజ్ఞ' అన్నాడు. రాముడు పితృవాక్య పరిపాలనయే తనకు ప్రధానమని భావించాడు. 'తండ్రి చేసిన వాగ్దానాన్ని నేను నిలబెట్టాలి' అన్నాడు. తల్లికి నమస్కారం చేసి సుమిత్ర వద్దకు బయలుదేరాడు.

సుమిత్ర దశరథుని రెండవ భార్య. ఆ కైలములో రెండవ పెళ్ళి చేసుకోదలచుకుంటే గవర్నమెంటు పర్మిషన్ అక్కరలేదు. కాని, మొదటి భార్య పర్మిషన్ కావాలి. కాబట్టి, సుమిత్రను వివాహమాడటానికి ముందు దశరథుడు కౌసల్య అనుమతిని కోరాడు. 'నాథా! మన రాజ్యానికి వారసుడు కావాలి కదా! మీకు నచ్చిన స్త్రీని మీరు వివాహమాడండి. నేనుకూడా తప్పకుండా ఆ వివాహములో పాల్గొంటాను' అన్నది కౌసల్య. దశరథునికి చాలా సంతోషం కలిగింది. 'ఇంతటి అనుకూలవతులైన భార్యలు కూడా వుంటారా ఈ లోకంలో!' అని ఆయన ఆశ్చర్యపోయాడు.

సుమిత్ర సార్థక నామధేయురాలు

సుమిత్ర చాలా గొప్ప గుణవంతురాలు. 'సు..మిత్ర' అన్న పేరుకు తగినట్లుగా ఆమె అందరిపట్ల మైత్రితో మెలగేది. సుమిత్ర కౌసల్య దగ్గరకు వచ్చి ఆమెను ఓదార్చుతూ, 'అక్కా! నీవెందుకు బాధ పడుతున్నావు? రాముడు ఎవరనుకున్నావు? సాక్షాత్ శ్రీమన్నారాయణమూర్తియే! అతను అయోధ్యలో వుంటే ఏమి! అరణ్యమునకు వెడితేనేమి! ఎక్కడుండినా మనవెంటనే వున్నాడు. రామునికి అయోధ్య, అరణ్యము రెండూ ఒక్కటే' అన్నది. సుమిత్ర మాటలు విన్న తరువాత కౌసల్యకు కొంత ధైర్యం వచ్చింది. ఆమె మనస్సుకు శాంతి చేకూరింది. సుమిత్ర చెప్పింది, 'అక్కా! నీకు, కైకేయికి ఒక్కొక్క కుమారుడు కలిగితే నాకు ఇరువురు కుమారులు పుట్టారు. కారణమేమిటో తెలుసా? రామునికి లక్ష్మణుడు సేవ చేయాలి. భరతునికి శత్రుఘ్నుడు సేవ చేయాలి. రామునికి, భరతునికి సేవలు టేసే నిమిత్తమే నేను ఇద్దరు కుమారులను కన్నాను. కాబట్టి, నా సంకల్పము చక్కగా నెరవేరనిమ్ము. లక్ష్మణుడు సీతారాముల వెంట అరణ్యానికి వెళ్ళి వారిని కంటికి రెప్పవలె కాపాడుతాడు. కాబట్టి, నీవేమీ భయపడనక్కరలేదు'.

ఊర్మిళ త్యాగనిరతి

లక్ష్మణుడు అరణ్యానికి బయలుదేరేముందు తన భార్య ఊర్మిళ వద్దకు వెళ్ళాడు. సీతారామలక్ష్మణులు అరణ్యానికి బయలుదేరుతున్న సంగతి అప్పటికింకా ఊర్మిళకు తెలియదు. ఆమె తన గదిలో కూర్చొని సీతారామ పట్టాభిషేక దృశ్యాన్ని 'పెయింట్' వేస్తున్నది. ఆ సమయంలో లక్ష్మణుడు వెళ్ళి, ఊర్మిళా!' అని పిలిచాడు. ఆమె లేచే

సమయంలో అక్కడున్న పెయింటు పొరపాటున ఆమె గీసిన చిత్రముపై ఒలికిపోయింది. 'అయ్యో! ఎంతో అందముగా గీసిన చిత్రము పాడైపోయిందే!' అని బాధపడింది. అప్పుడు లక్ష్మణుడు చెప్పాడు, 'ఊర్మిళా! లోకకళ్యాణమును చేకూర్చే శ్రీరామపట్టాభిషేకమును కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన చిత్రమును నేను చెడగొట్టాను. దీని గురించి నీవు బాధపడనక్కరలేదు. నేను రామునివెంట అరణ్యానికి వెడుతున్నాను' అని చెప్పాడు. ఆమె చాలా భయపడిపోయింది. 'రాముడు అరణ్యానికి పోవటమేమిటి? కొన్ని క్షణాల లోపల అతనికి పట్టాభిషేకము జరుగనున్నది కదా!' అన్నది. అప్పుడు లక్ష్మణుడు ఆమెకు జరిగిన సంగతి వివరించాడు. ఊర్మిళ గొప్ప త్యాగగుణము కలిగినది. తన భర్త తనను విడిచిపెట్టి వెడుతున్నాడని ఆమె విచారించ లేదు. అతనికి సీతారాముల సేవ చేసే అవకాశం లభించినందుకు ఎంతో ఆనందించింది. 'సీతారాముల సేవలో మీ కాలాన్ని సార్థకం గావించుకోండి. మాకెవ్వరికీ అట్టి భాగ్యము లభించ లేదు. మీరు ఆనందంగా వెళ్ళి రండి' అని చెప్పి నమస్కరించి లక్ష్మణుని పంపించింది.

జనకుడు తన కుమార్తెతో, 'సీతా! నీవు రాముని వెంట అరణ్యానికి వెడుతున్నావట. అరణ్యంలో అనేక క్రూరమృగములు సంచరిస్తుంటాయి. భయంకరమైన శబ్దాలు వినవస్తుంటాయి. నీవు వాటినన్ని తట్టుకొని నిర్భయంగా వుండగలవా?' అని ప్రశ్నించాడు. 'పురుషసింహమైన రాముడు నావెంట వుండగా ఏ మృగములు వస్తే నేకేమి భయం! రాముడు సాక్షాత్తు నారాయణమూర్తియే! కాబట్టి, మనము ఎవరికీ భయపడనక్కరలేదు' అని సీత సమాధానమిచ్చింది. ఈరీతిగా అందరికీ ధైర్యం చెప్పి సీతారామలక్ష్మణులు అరణ్యానికి వెళ్ళారు. అరణ్యంలో లక్ష్మణుడు సీతారాములను కంటికి రెప్పవలె చూసుకుంటూ వారికెంతో సేవ చేస్తూ వచ్చాడు.

రావణ సంహారము గావించి సీతను వెంట పెట్టుకొని రాముడు తిరిగి వచ్చినప్పుడు అయోధ్యాప్రజలు ఆనందంతో జయజయధ్వానాలు సల్పుతూ వారికి సావగతం పలికారు. 'రామచంద్రుడు వచ్చాడు. సీతమ్మ తల్లితో వచ్చాడు. మన అయోధ్యకు ఈనాడు వెలుగు వచ్చింది. శ్రీమన్నారాయణమూర్తి , లక్ష్మీదేవి ఇరువురూ కలసి వచ్చిన ఈ దినమెంతో సుదినం' అని అయోధ్యా వాసులు పండుగ జరుపుకున్నారు. సాక్షాత్తు నారాయణమూర్తి లక్ష్మీదేవితో కూడి దర్శనమిచ్చినప్పుడు ఎంత ఆనందముగా వుంటుంది.

ఇది రామరాజ్యము, ఇది ప్రేమరాజ్యము

ఈ రాజ్యాన్ని మీరు రామరాజ్యంగా మార్చండి. రామరాజ్యంలో అందరూ సుఖంగా వుండాలి. రాముడు లేని రాజ్యము రాక్షస రాజ్యము. ఈనాడుకూడా మన భారత దేశములో ప్రతి పల్లెయందు, ప్రతి గుడిసె యందు కూడను రాముని చిత్రపటము పెట్టుకొని పూజిస్తుంటారు. పిల్లలకు 'రామ' అని, 'సీత' అని పేర్లు పెడుతుంటారు. కొన్ని వేలసంవత్సరములు గడచిపోయినప్పటికీ ఈనాటివరకు 'సీత' 'రామ' అనే నామములు ఏమాత్రమూ మారలేదు. మారవు. అనేక రాజ్యములలో అనేక యుద్ధములు జరిగాయి. కాని, మన భారతదేశములో ఏనాడుకూడను యుద్ధము జరుగదు. జరుగబోదు. ఇది రామరాజ్యము. ఇది ప్రేమరాజ్యము. ఇది శాంతిరాజ్యము.

గతజీవుడగు పతిన్ బ్రతికించుకున్నట్టి
    సావిత్రి భారత సతియె కాదె!
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
    చంద్రమతి పవిత్ర పడతి కాదె!
కులసతీత్వమునకై గుండాన దూకిన
    సీత భారత ధరాజాత కాదె!
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
    దమయంతి భారత రమణి కాదె!
సప్త సాగర పరివేష్టితోర్వితలము
భరత జాతి పాతివ్రత్య ప్రవిలంబు
భావసంపదకిది మహా పంట భూమి
అఖిల దేశములకిది ఉపాధ్యాయి కాదె!

ఇలాంటి మహాతల్లులు వుండటం చేతనే ఈనాటివరకు భారతదేశము నిత్యకళ్యాణము, పచ్చతోరణముగా ప్రకాశిస్తున్నది. మీకు తెలుసు, భార్య మరణిస్తే మగవారు వెంటనే రెండవ పెళ్ళికి ప్రయత్నం చేస్తుంటారు. కాని, స్త్రీలలో అలాంటి

వారు లేరు. అనాది కాలమునుండి భారతదేశము అన్ని దేశములకు ఉపాధ్యాయ స్థానంలో వున్నటువంటిది. కనుకనే, భారతదేశములో శ్రీమన్నారాయణుడు పుట్టి, అనేక లీలలను, మహిమలను చూపి, ప్రతి జీవినికూడను ఉద్ధరిస్తూ వచ్చాడు.

ప్రతి మానవుడు ఆత్మయొక్క ప్రతిబింబమే! కనుకనే, శ్రీకృష్ణుడు చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' మీరందరూకూడా రామస్వరూపులే. మీ రూపనామములు వేరువేరుగా వుండవచ్చును. కాని, మీ అందరియందు ఆత్మారాముడు ఒక్కడే వున్నాడు. కనుక, రాముడు ఎక్కడో వున్నాడని మీరు యోచించకండి. మీ హృదయమే రామునియొక్క మందిరము. కాబట్టి, మీ హృదయంలో వున్న రాముని మీరు నిరంతరము స్మరిస్తూ వుండండి. జాగ్రదవస్థలోగాని, స్వప్నావస్థలోగాని, సుషుప్తిలోగాని ఎప్పుడుకూడను రాముడు మీ ఇంటనే, వెంటనే, జంటనే కంటనే వున్నాడు. రాముడనగా ఒక ప్రత్యేకమైన వ్యక్తిస్వరూపుడు కాదు. తాను అనేక రూపాలను ధరిస్తుంటాడు. రూపములు వేరైనప్పటికీ దివ్యత్వం ఒక్కటే! కాబట్టి, మీరు ఎవరిని చూచినప్పటికీ సాక్షాత్తు శ్రీరాముడినే చూచినట్లుగా భావించి నమస్కరించాలి. ఈనాడు అట్టి ధర్మమును, అట్టి ప్రేమను, అట్టి శాంతిని ప్రకటిస్తూ వున్నాడు. కనుకనే, స్వామికి 'సాయిరామా' , 'సాయికృష్ణా' అని పిలుస్తూ వస్తున్నారు. ప్రతి వ్యక్తి కూడను రాముడే. అందరూకూడ ఈశ్వరులే. నీలోనే వున్నాడు రాముడు. నీవు రాముడవు. ఇట్టి సత్యాన్ని మీరు హృదయములో ప్రతిష్ఠ చేసుకొని కాలమును సార్థకం గావించుకోండి. మీ జీవితమంతా నిత్యానందంగా వుంటుంది. రామనామాన్ని నిరంతరం స్మరిస్తూ రండి.

రామా కోదండరామా రామా పట్టాభిరామా
రామా కళ్యాణరామా రాఘవా!
రామా నీదొక్క మాట రామా నాకొక్క మూట
రామా నీ పాటే పాట రామా నీ బాటే బాట
రామా నీకెవరు తోడు రామా నీ కంట చూడు
రామా నను నీ వాడు రామా నాతో మాటాడు
రామా నీ నామమే మేలు
రామా నీ చింతనే చాలు
నీ నామమే మేలు నీ చింతనే చాలు

ఎన్ని సంవత్సరములు గడిచినప్పటికీ, ఎన్ని యుగములు మారినప్పటికీ రామనామమును మాత్రం ఎప్పటికీ మరువకూడదు. రాముడు నిన్ను వదలి వుండలేడు. నీవు రాముని వదలి వుండలేవు. నీవు ఎవరిని ఏ పేరుతో పిలిచినప్పటికీ ఆ వ్యక్తిలో వున్నది రాముడే! 'సాయిరామా' అనండి, అయోధ్యరామా అనండి. ఏ పేరుతోనైనా పిలువ వచ్చు. రామనామాన్ని నిరంతరమూ స్మరిస్తూ రండి.

..........................................................................................................................................